క్లుప్తంగా

హాస్టళ్లను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న అజయ్‌యాదవ్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ఎస్సీ బాలుర, బీసీ బాలికల హాస్టళ్లను శుక్రవారం ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూరలు రుచిగా లేవని విద్యార్థినులు, బెడ్స్ సరిగా లేవని విద్యార్థులు అజయ్‌యాదవ్‌కు మొరపెట్టుకున్నారు. హాస్టళ్లు సందర్శిస్తున్నారా లేదా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే ఏమీ చేస్తున్నారని మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు హాస్టళ్లను సందర్శించాలని ఆదేశించారు. వెంట తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో కృష్ణప్రసాద్,ఎంపీవో బషీరోద్దీన్, ఏఈఓ మొగిళి,కార్యదర్శినర్సయ్య, తిరుపతిఉన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి అనుకున్న స్థాయిలో నిధులు కేటాయించక అన్యాయం చేసిందంటూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు విద్యా రంగాభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రకటించి అందుకు భిన్నంగా విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నిరసనలో నాయకులు నితిన్, జాన్సన్, స్పందన రెడ్డి, బన్నీ, శ్రావణ్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి



వినతిపత్రమిస్తున్న భాస్కరాచారి, నాయకులు

రామడుగు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల శాఖ అధ్యక్షులు బొమ్మకంటి భాస్కరాచారి, నాయకులు జిట్టవేని అంజిబాబు, కట్ల రవీందర్, వడ్లూరి రాజేంద్రాచారి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

హుజూరాబాద్: ప్రాథమిక పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హుజూరాబాద్, జమ్మికుంట డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఇచ్చిన ప్రమోషన్లలో ఎస్జీటీ టీచర్లకు తీవ్ర నష్టం జరిగిందని, గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వకుండా నిరాశకు గురిచేసిందన్నారు. అన్ని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘు శంకర్‌రెడ్డి,రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సారాల సంపత్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందం,రత్నం తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత



బుక్స్ అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థపకుడు పల్లె ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫౌండేషన్ నిర్వాహకులు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు. నిర్వాహకులు పల్లె రవిగౌడ్, గండి రంజితకుమార్‌గౌడ్, గిరవేన రాజయ్య యాదవ్, గిరవేన గణేష్‌యాదవ్, తాటిగంటి వీరస్వామి, గోదుగు రమేష్ యాదవ్, కడవెరుగు సంపత్, పాఠశాల హెచ్ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు దబ్బెట రవీందర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక నిర్వహణ భారం

- పంచాయతీలకు విడుదల కాని ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధులు
- పేరుకుపోతున్న కరెంటు బిల్లులు, ట్రాక్టర్ కిస్తీలు



గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ భవనం

చిగురుమామిడి: గ్రామ పంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ(స్టేట్, సెంట్రల్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు విడుదల కాకపోవడంతో జీపీల నిర్వహణ భారంగా మారింది. చిగురుమామిడి మండలంలో ఏడు చిన్న, పది పెద్ద గ్రామ పంచాయతీలున్నాయి. కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడంలేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనలేని పరిస్థితి నెలకొందని, ఇంటి పన్నులు, నల్లా బిల్లుల వసూళ్లు అంతంత మాత్రమే వీటివల్ల ట్రాక్టర్ కిస్తీలు చెల్లించలేకపోవడంతోపాటు బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ దీపాలు, పారిశుధ్య పనులు, తాగునీటి పైపులైన్ రిపేర్లు, కాలిన మోటార్ల మరమ్మలు చేయించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా చెల్లించాల్సిన కరెంటు బిల్లులు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో బకాయిలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. చిన్న, పెద్ద జీపీలకు వేలల్లో కరెంటు బిల్లులు వస్తుండగా చెల్లించేందుకు నానాయాతలు పడుతున్నారు.

నిధులు విడుదలైతే ఊరట

వర్షాకాలంలో దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉంటుంది. ఎప్పటికప్పుడు మురుగుకాల్వలను శుభ్రం చేస్తూ దోమల నివారణ మందు పిచికారీ చేయాల్సి ఉంటుంది. వీధుల్లో పేరుకుపోయిన గడ్డి, ఇతర పిచ్చిమొక్కలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులకు తోడుగా మరికొంత మంది కూలీలతో పనులు చేయించాల్సి ఉంటుంది. 18 నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల కాకపోవడం వల్ల జీపీల నిర్వాహణ కష్టతరంగా మారిందని పలువురు వాపోతున్నారు. నిధులు విడుదలైతే చిన్న గ్రామపంచాయతీలకు ఊరట కల్గుతుంది. కరెంటు బిల్లులు, ట్రాక్టర్ కిస్తీలు, డిజిల్ ఖర్చులతో పాటు పలు అవసరాలకు ఎంతో ఉపయోగపడుతాయని ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులతోనే ఇంతకాలం జీపీల నిర్వహణ జరిగింది. నెలనెలా టంఛన్‌గా నిధులు విడుదలకాగా జీపీల్లోని అన్ని అవసరాలు తీరేవి. జీపీ పాలకమండళ్లు లేని కారణంగా ఏడు నెలలుగా సీఎఫ్‌సీ నుంచి నిధులు విడుదల కావడంలేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు రాక కొందరు పంచాయతీ కార్యదర్శులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. హుస్నాబాద్, కరీంనగర్ వంటి పట్టణాల్లోని షాపుల్లో జీపీలకు కావాల్సిన సామగ్రి ఉద్దెర తెస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల చేయాలని తాజామాజీ సర్పంచులు, గ్రామస్థాయి అధికారులు కోరుతున్నారు.

అవస్థలుపడుతున్నారు

గ్రామ పంచాయతీలకు సీఎఫ్‌సీ, ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు లేక ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అవస్థలు పడుతున్నమాట వాస్తవం. కాలిన మోటార్లు, పైపులైన్ల మరమ్మతులకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. సమస్యలను ప్రభుత్వం, దృష్టికి తీసుకెళ్తాం.

– మధుసూదన్, ఎంపీడీవో, చిగురుమామిడి

ప్లాస్టిక్ నిర్మూలనలో మహిళల పాత్ర కీలకం

జమ్మికుంట: ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో జీవన జ్యోతి పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయగా శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వివాహం, ఇతర వేడుకల్లో స్టీల్ వస్తువుల వాడకంతో ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. స్టీల్ వస్తువులు కిరాయికి ఇవ్వడంతో మహిళా సంఘాలకు ఆదాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, ఎండీఎంసీ మల్లీశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు రాణి, కోశాధికారి గీత, కార్యదర్శి మౌనిక, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల ఆర్పీలు, ఓబీలు, సభ్యులు పాల్గొన్నారు.



స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ అయాజ్

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. మండలంలోని తనుగుల రైతువేదిక ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వీరమనేని పర్శరామ్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఇంటి ఆవరణలో ఆరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఏఈవోగట్టు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి భద్రయ్య, పలువురు పాల్గొన్నారు.పట్టణంలోని 21వ వార్డులో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు.

శంకరపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని డీసీవో శ్రీరామసుజాచార్యులు అన్నారు. మండలంలోని కొత్తగట్టు సహకార స్థలంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో మెట్‌పల్లి సింగిల్ విండోచైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, ఆడిట్ అధికారి శ్రీనివాస్, సీఈవో సదయ్య, డైరెక్టర్లు రాజిరెడ్డి, సుధాకర్, మహిళలు, రైతులున్నారు.



మొక్కలు నాటుతున్న ఏడీఏ సునీత, నాయకులు

ఘనంగా పోచమ్మ బోనాలు



రామడుగు: మండలంలోని వెలిచాలలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాస్యాలు ఆకట్టుకున్నాయి.పాఠశాల కరస్పాండెంట్ జగన్‌మోహన్‌గౌడ్, హెచ్ఎంభాగ్యలక్ష్మీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని గుండి అక్షర పాఠశాలలో బోనాల వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు అమ్మవారికి బోనాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్, డైరెక్టర్ రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాల పండుగ విజయవంతం చేయాలి

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో నిర్వహించే శ్రీమహంకాళి అమ్మవారి బోనాల పండుగ విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం మండలంలోని వివి ధ శాఖల మండల అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. 28న నిర్వహించే బోనాల ఊరేగింపుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. వెంట కె.శంకర్, ఎ.ఆంజనేయులున్నారు.

సంక్షిప్త వార్తలు

● **డిపో మేనేజర్‌గా రవీంద్రనాథ్**

హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వి. రవీంద్రనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల నుంచి హుజూరాబాద్‌కు బదిలీపై వచ్చారు.

● **రెండో వార్డులో డ్రై డే**

హుజూరాబాద్: పట్టణంలోని రెండో వార్డులో శుక్రవారం మున్సిపల్ అధికారులు డ్రై డే నిర్వహించారు. మురుగుకాలువల్లో చెత్తా చెదారం వేయకుండా ప్రతిరోజు ఇంటింటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని, ఇంటి పరిసరాలు తప్పనిసరిగా శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

● **కార్గిల్ అమరులకు నివాళి**

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం కార్గిల్ అమరులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు నివాళి అర్పించారు. కార్గిల్‌ను విడిపించుకునే క్రమంలో పాకిస్తాన్‌తో భారతదేశం చేసిన యుద్ధంలో ఆర్మీ అధికారులు, సైనికులు వీరమరణం పొందారని, వారిని స్మరించుకుంటూ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

● **మానకొండూర్ ఎంపీడీవోగా వరలక్ష్మి**

మానకొండూర్‌రూరల్: మానకొండూర్ ఎంపీడీవోగా వి.వరలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన నర్సయ్య పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో కొమురంభీం ఆసీఫాబాద్ జిల్లా నుంచి వరలక్ష్మి బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

● **నియామకం**

రామడుగు: మండలంలోని రుద్రారంకు చెందిన చిలుముల లక్ష్మణ్ మాదిగను మహాజన సోషలిస్టు పార్టీ రామడుగు మండల అధ్యక్షుడిగా నియామకం చేస్తూ ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి, బోయిని కొంరయ్య మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర , జిల్లా నాయకులకు లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

● **హుజూరాబాద్ సబ్‌జైలర్‌కు సన్మానం**

హుజూరాబాద్: హుజూరాబాద్ సబ్‌జైల్ జైలర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాంపల్లి దేవేందర్‌ను శుక్రవారం జీకే రైతు మిత్ర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.ఖైదీలు సాధారణ పౌరులుగా మారే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

● **మార్కెట్ చైర్మన్‌కు..**

చొప్పదండి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్తూరి మహేశ్‌ను మండలంలోని ఆర్నకొండలో శుక్రవారం పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మచ్చ రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

● **శుక్రవారం సభ**

శంకరపట్నం: మండలంలోని ముత్తారం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యసిబ్బంది వివరించారు.

సైదాపూర్: అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సైదాపూర్ మెడికల్ ఆఫీసర్ సౌమ్య సూచించారు. వెన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

● **ఆరోపణలు మానుకోవాలి**

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీడి దేవేందర్ అన్నారు. వల్భాపూర్ గ్రామంలో మాట్లాడారు. ఓర్వలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

● **బియ్యం పంపిణీ**

తిమ్మాపూర్: మండల కేంద్రానికి చెందిన చిలివేరి కమలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము శుక్రవారం పరామర్శించారు. యాభై కిలోల బియ్యం అందజేశారు.

● **'మండల అభివృద్ధిపై పట్టింపేది'**

సైదాపూర్: మండల అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పట్టింపులేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు ఆరోపించారు. ఎన్నికలకు ముందు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని పటించుకోవడం లేదన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.

● **మంత్రికి సమస్యల విన్నపం**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనగందుల లక్ష్మణ్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. పలు సమస్యలను మంత్రికి విన్నవించారు.

● **ప్రతీ ఒక్కరు బీమా చేసుకోవాలి**

మానకొండూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్షా బీమా చేసుకోవాలని వెల్ది యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుధాకర్ అన్నారు. వెల్దికి చెందిన కుంభాల రామలక్ష్మి(55) ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందింది. బీమా చేసుకోవడంతో రూ.రెండు లక్షల బీమా చెక్కు మంజూరైందన్నారు. చెక్కును భర్త అంజయ్యకు శుక్రవారం అందజేశారు.

● **ఆర్థిక సాయం అందజేత**

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి మాచర్ల మాన్సీ ఓపెన్ హార్ట్ సర్జరీకి చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.14 వేలు సమకూర్చారు. దాతల సహకారంతో సేకరించిన మొత్తాన్ని శుక్రవారం చిన్నారి తండ్రి మాచర్ల అనిల్‌కు అందించారు.

● **ఏసీపీ విచారణ**

చొప్పదండి: పట్టణంలోని సంతోష్‌నగర్‌లో వివాహిత రాచకొండ మమత మృతిపై కరీంనగర్ రూరల్ ఇన్‌చార్జి ఏసీపీ కాశయ్య శుక్రవారం విచారణ జరిపారు. మృతురాలి భర్త లక్ష్మణ్ వేధింపుల కారణంగా మమత ఆత్మహత్య చేసుకుందనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● **ఇరువర్గాలపై కేసు**

గన్నేరువరం: గన్నేరువరం మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మి, భర్త లక్ష్మణ్, కుమారుడు సాయి, భూమాడి రత్నకాంతమ్మ, కుమారుడు కిరణ్‌రెడ్డి మధ్య గెట్టు వివాదం జరిగింది. ఒకరికొకరు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసకుకోగా ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

● **గొడవలో ఒకరికి తీవ్రగాయాలు**

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో పానీపూరి బండి వద్ద శుక్రవారం జరిగిన గొడవలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కన్నాపూర్ గ్రామానికి చెందిన కొందరు పానీపూరి నిర్వాహకుడితో గొడవకు దిగారు. ఈక్రమంలో మొలంగూర్‌కు చెందిన పిట్టల సంపత్ మధ్యలోకి వెళ్లగా అతడిపై దాడిచేశారు.

● **కారు–బైక్ ఢీ**

శంకరపట్నం: కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కేశవపట్నం గ్రామానికి చెందిన కల్లూరి ఐలయ్య మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలోకి బైక్‌పై వెళ్తుండగా తాడికల్ గ్రామానికి చెందిన కారు ఢీకొంది.

● **గీత కార్మికుడికి గాయాలు**

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడటంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

● **పరామర్శ**

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యుడు పైడిపెల్లి అనిల్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. శుక్రవారం సంఘం నాయకులు పరామర్శించారు. అనిల్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

తొలగనున్న విద్యుత్ సమస్య

- మొగిలిపాలెం, పొలంపల్లి శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- దాదాపు ఎకరా స్థలంలో నిర్మాణం
- రూ.3.52 కోట్ల నిధులు మంజూరు

తిమ్మాపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్‌స్టేషన్ మంజూరైంది. మండలంలోని మొగిలిపాలెం , పొలంపల్లి శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి తెలిపారు. దీనికోసం స్థలం కేటాయించాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా దాదాపు ఎకరా స్థలం కేటాయించారని, స్థలానికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొగిలిపాలెం, పొలంపల్లి, పర్లపల్లి నర్సింగాపూర్ గ్రామాల్లో విద్యుత్ సమస్య ఉందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లికి విన్నవించగా సబ్‌స్టేషన్ మంజూరుకు కృషిచేశారని, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆగస్టులో భూమిపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను శుక్రవారం హైదరాబాదులో కలిశామన్నారు. మంత్రిని కలిసిన వారిలో పొలంపల్లి మాజీ ఎంపీటీసీ బండారి రమేశ్, పెట్టం కిరణ్, మహమ్మద్ హసన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంతో రమణారెడ్డి, నాయకులు

రూ. మూడున్నర కోట్లు మంజూరు

మొగిలిపాలెం శివారులో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.52 కోట్లు మంజూరైనట్లు ఏఈ అరవింద్‌రెడ్డి తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అధిక నిధులు కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మానకొండూర్ మండల అధ్యక్షుడు కనకం అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు జి.సంపత్, కె.సురేశ్, మహేందర్, రామకృష్ణ, ఏదెలు, అంజయ్య, మహేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్

హుజూరాబాద్: అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతును రాజు చేయడం లక్ష్యంగా వరంగల్ డిక్లరేషన్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగానికి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్యమిచ్చిందన్నారు.పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్లో కేటాయించడం అభినందనీయం, గత ప్రభుత్వ నాయకులు బడ్జెట్ అంటే అంకెల గారడీ చేసి చూపించి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి దోచుకున్నారని, 8 మంది బీజేపీ ఎంపీల్లో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జమ్మికుంట: బడ్జెట్‌లో ఎస్సీ నిధుల కోతను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేశ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో పార్టీ ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. గతంలో కేటాయించ దానికంటే కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ నిధులు కేటాయించి దళితులను మోసం చేసిందని, రాబోయే రోజుల్లో దళితులు కాంగ్రెస్‌ను బొంద పెడతారని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత మోర్చా నాయకులు రాకేశ్‌ఠాకూర్, అమృతలక్ష్మి, అనిత, సుశీల, తూడి రవిచంద్రారెడ్డి, రామస్వామి, మహేందర్, తిరుపతి, సమ్మన్న, విజయ్, శ్రీనివాస్, రమేశ్‌కుమార్, రాకేశ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చొప్పదండి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి కోరారు. మండలంలోని ఆర్నకొండలో చొప్పదండి మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు మావురం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సింగిరెడ్డి కృష్ణారెడ్డి, గంటల రమణారెడ్డి, గొల్ల గట్టయ్య, తోట కోటేశ్, ఏలేటి తిరుపతిరెడ్డి, కూకట్ల తిరుపతి, మొగిలి మహేశ్, శ్రీపాద రవి, జొంగోని తిరుపతిగౌడ్, గన్ను నర్సింహరెడ్డి, మ్యాకల రాము, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులపై నిరసన

చొప్పదండి: అసంపూర్తి పనులపై బీజేపీ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టక పోవడంతో వర్షాలకు బురుదమయంగా మారిన రోడ్డుపై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా అధికారులు స్పందించడం లేదని నాట్లు వేసి నిరసన తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తే తూతూ మంత్రంగా మొరం పోసి వదిలేశారని, ప్రజల ఇబ్బందులను త్వరగా పరిష్కరించకపోతే మున్సిపాలిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసనలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, చిల్ల శ్రవణ్, గుండేటి శివశంకర్, మంద శ్రీరాం, జిట్ట కుమార్, అనుకారి సాయికృష్ణ, వడ్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

● **ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా రవీందర్**

శంకరపట్నం: కేశవపట్నం ఎస్సీ హాస్టల్ బాలుర వార్డెన్‌గా రవీందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వావిలాల ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న రవీందర్ కేశవపట్నంకు బదిలీపై వచ్చారు. వార్డెన్‌తో పాటు కుక్ విధుల్లో చేరగా నైట్ వాచ్‌మెన్, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గంజాయి విక్రయిస్తే చర్యలు

మానకొండూర్: గంజాయి, మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ సీపీ అభిశేక్ మహంతి ఆదేశాల మేరకు మత్తుపదార్థాల నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. యువత చెడు మార్గంలో ప్రయాణిస్తూ తమ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మండలంలోని ప్రతా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

వాహనాల తనిఖీ

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్ సరిగా లేకపోవడం, త్రిబుల్, మైనర్ డ్రైవింగ్ సంబంధించి 20 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వివేక్‌తోపాటు పోలీసులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన



మేనేజర్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

శంకరపట్నం: రుణమాఫీ జాబితా ప్రభుత్వానికి పంపలేదని మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంక్ ఎదుట శుక్రవారం కన్నాపూర్ రైతులు ఆందోళన చేపట్టారు. వేరే బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు రూ.లక్షవరకు మాఫీ అయ్యిందని ఆరోపించారు. రుణమాఫీపై వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే బ్యాంక్ అధికారులు జాబితా పంపలేదని చెప్పారని రైతులు బ్యాంక్ మేనేజర్‌ను ప్రశ్నించారు. గతంలో రూ.లక్షమాఫీ అయినట్లు మెస్సేజ్ వచ్చిందని బ్యాంక్‌లో డబ్బులు వాపస్‌పోయినట్లు చెప్పారు. మెయిన్ బ్రాంచ్ నుంచి ప్రభుత్వానికి రుణమాఫీ జాబితా పంపించామని, రైతులు ఆందోళన చెందొద్దని అందరికీ రుణమాఫీ అవుతందని మేనేజర్ నచ్చచెప్పడంతో రైతులు శాంతించారు.

నూతన విద్యావిధానంపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్యాకల్టీ ఫోరం ఆధ్వర్యంలో నూతన విద్యా విధానంపై రసాయన శాస్త్ర అధ్యాపకుడు ఎడమ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా ప్రైవేటు పరమైతే మానవ విలువలు నశించిపోతాయన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు రామ్మోహన్‌రావు, రేణ ఈశ్వరయ్య, సువర్ణ, స్వరూపారాణి, మమత, సుష్మ, రవి, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రవీందర్, సుధాకర్, అనూష, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.